# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- హరిత ఇందన ఉత్పత్తికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ మారబోతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- పసుపు, మిరప పంటల ఉత్పత్తిలో రాష్ట్రం అగ్ర స్థానంలో ఉందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు.
- పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.
- జాతీయ రహదారుల నిర్మాణం కోసం భూసేకరణను ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు.
- గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల తేదీలను ఏపీపీఎస్సీ ఈరోజు ప్రకటించింది.

======================

గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారబోతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా సీఐఐ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్‌పై నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ… రాష్ట్రంలో సంప్రదాయేతర ఇంధన వనరులలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిపై ఎక్కువ దృష్టి పెట్టామన్నారు. అలాగే పంప్డ్ స్టోరేజీ ద్వారా హైడల్ విద్యుత్ ఉత్పత్తికి సైతం ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రంలో సంవత్సరానికి 5 బిలియన్ టన్నుల ఎంపీటీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నామని చెప్పారు. అదే విధంగా సుమారు 2 వేల కోట్ల డాలర్ల పెట్టుబడితో ఎన్టీపీసీ-ఏపీ, జెన్‌కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నాయని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

======================

రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణకు సంబంధించి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుండి రెవెన్యూ, అటవీ, జాతీయ రహదారుల సంస్థ, రోడ్డు రవాణా తదితర శాఖల అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా ఆయన ఈ రోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అటవీ శాఖ అనుమతుల మంజూరుకి అవసరమైన ప్రక్రియను చేపట్టాలని కోరారు. భూసేకరణకు సంబంధించిన నిబంధనల ప్రకారం రైతులకు నష్ట పరిహారాన్ని అందించాలని స్పష్టం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పని చేయాలని విజయానంద్ కోరారు.

=====================

ఆంధ్రప్రదేశ్‌లో పసుపు, మిరప పంటలలో ఉత్పత్తిలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గత ఏడున్నార దశాబ్దాలుగా ఉన్న కేంద్ర పొగాకు పరిశోధన కేంద్రం (CTRI) పేరును వాణిజ్య వ్యవసాయ జాతీయ పరిశోధన సంస్థ నార్క్ గా మార్చారు. నార్క్ లోగోను కేంద్ర సహాయ మంత్రి ఈ రోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఇప్పటి వరకూ పొగాకు పరిశోధనలు మాత్రమే జరిగిన ఈ కేంద్రంలో ఇకపై వాణిజ్య పంటలైన మిరప, పసుపు, అశ్వగంధ పంటల పరిశోధనలు కూడా జరుగుతాయని మంత్రి తెలియజేశారు.

(వాయిస్ 24 సెకన్లు)

=====================

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల తేదీలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (APPSC) ఈ రోజు ప్రకటించింది. మే 3 నుండి 9వ తేదీ వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహిస్తామని ఏపీపీఎస్సీ కార్యదర్శి తెలిపారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తామని, ప్రశ్నపత్రాన్ని ట్యాబ్‌లలో ఇచ్చేందుకు నిర్ణయించామని చెప్పారు. కాగా, రాష్ట్రంలోని మొత్తం 81 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గత సంవత్సరం మార్చి 17న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. మొత్తం ఒక లక్షా 48 వేల 881 మంది ప్రిలిమ్స్‌కు దరఖాస్తు చేసుకోగా 4 వేల 496 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు.

=====================

పారిశ్రామికంగా రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫారుక్ తెలిపారు. నంద్యాలలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రామాయపట్నం ప్రాంతంలో బిపిసిఎల్ ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టులతో పాటు పిన్నాపురం గ్రీన్ పార్క్, ఓర్వకల్లు డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టులు రాయలసీమ ప్రాంతం ముఖచిత్రాన్ని మార్చానున్నాయని తెలిపారు. అదే విధంగా నదుల అనుసంధానంతో రాయలసీమ సస్యశ్యామలం అవుతుందన్నారు.

విరామం

=====================

పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా పని చేస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో అభివృద్ధి పనులను మంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... అంతర్జాతీయ నిపుణుల సలహా మేరకు డయాఫ్రమ్ వాల్ పునర్నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో 80 శాతం పైన పూర్తయిన టిడ్కో ఇళ్ళను వెంటనే పూర్తి చేసి పేదలకు అందచేస్తామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్30 సెకన్లు)

======================

నవజీవన నిర్మాణం పేరుతో విశాఖలో కొత్త కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. విశాఖపట్టణంలో ఈ రోజు పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్, మహిళలపై ఆన్ లైన్ మోసాల నివారణ వంటి అంశాలపైన ప్రతి పాఠశాల, కళాశాల, విశ్వ విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు.

======================

అనకాపల్లి జిల్లా పరవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో ఈ రోజు అగ్నిప్రమాదం జరిగింది. మెట్రో కెమ్ ఫార్మా కంపెనీలోని ఈటీపీ ప్లాంట్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో కార్మికులు ఎవరికీ ఏమీ కాలేదని జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ జి.నాగరాజారావు తెలిపారు. ప్రమాద సంఘటనపై జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ విచారణకు ఆదేశించారని, దర్యాప్తు అనంతరం నివేదిక సమర్పించడం జరుగుతుందన్నారు.

======================

రాష్ట్రం నుంచి ఈ నెల 24 తేదీ నాటికి ఈశాన్య రుతుపవనాల విరమణకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. మరిన్ని వివరాలను అమరావతిలోని వాతావరణ అధికారి వెల్లడిస్తారు.

(వాయిస్ 22 సెకన్లు)

======================

రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా అధికారులందరూ పనిచేయాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ ఆదేశించారు. నెల్లూరులో ఈ రోజు జరిగిన రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడం, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించడమే జాతీయ మాసోత్సవాల ప్రధాన లక్ష్యమన్నారు.

======================

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని జి.ఎం.సీ బాల యోగి స్టేడియంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ టీ.నిషాంతి అధికారులను ఆదేశించారు. ఈనెల 26వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని కోరారు. జిల్లాలో వివిధ విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

======================

జమ్మూకశ్మీర్ లో నిన్న సైనికులు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన కాల్పులలో చిత్తూరు జిల్లాకు చెందిన జవాన్ కార్తీక్ మృతి చెందారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కాగా, కార్తీక్ చూపించిన ధైర్యసాహసాలకు, త్యాగానికి శాల్యూట్ చేస్తున్నానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అన్నారు.

======================

తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు 6 గంటలలో సర్వదర్శనం జరుగుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు.

=======================

=======================